www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 3 మార్చి 2023
5
వైఎస్ఆర్





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయ్ రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజా

సిఆర్‌పిలకు ఎంటిఎస్ అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఆర్‌పిలకు ఎస్‌జిటి కేడర్‌లోని మినిమం టైమ్ స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఆర్‌పిలతో పదేళ్లుగా పాలకులు, అధికారులు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేస్తామని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చి అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సిఆర్‌పిలతో జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా పనులు చేయించుకోవడం పరిపాటిగా మారిందని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి అధికారంలోకి వస్తే సిఆర్‌పిల అన్ని రకాల సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశలు నీరు గారాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న సిఆర్‌పిలకు ఇస్తున్న రూ.23,500 స్థానంలో రూ.32, 670 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు గోపీనాథ్, కిరణ్ కుమార్, సూర్య కుమార్, జావిద్, సుజిత్ పాల్గొన్నారు.



అట్లూరు: నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

ఆడ పిల్లలను రక్షిద్దాం

ప్రజాశక్తి-కాశినాయన

నేటి సమాజంలో ఆడ పిల్లల శాతం తగ్గి పోతుంది, వారిని చదివించి రక్షించే బాధ్యత మనందరిపై ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల పేర్కొ న్నారు. గురు వారం మండల పరిధిలోని వరికుంట్ల కస్తూర్బా పాఠశాలలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ మేరీ రాణి ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వెయ్యి మంది మగ పిల్లలకు 955 మంది ఆడపిల్లలు ఉన్నారని అంటే ఆడపిల్లల శాతం గణనీయంగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. స్కానింగ్ పరీక్షలు చేయించుకుని అబార్షన్ చేసుకోవడం చట్టరీత్యా నేరమని వాపోయారు. కొంతమంది ఆడపిల్లలు అని తెలియగానే గర్భంలోనే చంపే స్తున్నారని, ఇటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి వ్యాధులైన దూరంగా ఉంటాయని హ్యాండ్ వాష్ అనేది చాలా ముఖ్యమని ఈ సందర్భంగా వారికి గుర్తు చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు ఆరోగ్య సూత్రాలను బాలలకు వివరించారు. నాగమణి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **అట్లూరు :** మండలంలోని గ్రామాల వారీగా బాలికల రక్షణపై అవగాహన కార్యక్రమాలు వైద్య సిబ్బంది నిర్వహించారు. అట్లూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది కస్తూర్బా బాలికల పాఠశాలలో పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె. అమితాబేగం, సిహెచ్ఒ మురళీకృష్ణ, హెచ్ఎం లక్ష్మీదేవి, మాణిక్యమ్మ, సీతమ్మ, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎంపిగా పోటీకి సిద్ధం



మాట్లాడుతున్న చీకటి చార్లెస్

కడప : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రకటిస్తే కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. గతంలో(2009) తనకు 2009 రాజంపేట అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనుభవం ఉందని తెలిపారు. కడప ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని అన్నారు.

రూ.56 లక్షలతో సిసి రోడ్లు పూర్తి

ప్రజాశక్తి-కలసపాడు



మాట్లాడుతున్న హసీనా ఫర్వేజ్

మండలంలోని చెన్నుపల్లి, కలసపాడు, లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీల్లో రూ. 56 లక్షల వ్యయం చేసి సిసి రోడ్లను నిర్మించామని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ హసీనా ఫర్వేజ్ పేర్కొన్నారు. గురువారం ఆమె ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో గడపగడప కార్యక్రమం కింద మూడు సచివాలయాల పరిధిలోని చెన్నుపల్లి, లింగారెడ్డిపల్లె, కలసపాడు, అక్కవారిపల్లె గ్రామాల్లో సిసి రోడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే కలసపాడు, చెన్నుపల్లి, లింగారెడ్డిపల్లె గ్రామాల్లో పూర్తి చేశామని చెప్పారు. వీటికి సంబంధించిన బిల్లులు త్వరలో అధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సుజిత్, బాషా పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జీవిఎంసి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు ఇంటి స్థలాలు కావాలని గతంలో కోరినామని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇంటి స్థలాలు వచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు షకీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి రవిబాబు, కోశాధికారి రాజు, విశ్వనాథ్ రెడ్డి, జి. శివకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీరాములు, రెవిన్యూ ఆఫీసర్ భాస్కర్ గౌడ్, మేనేజర్ హిదయతుల్లా, ఇక్బాల్, బాబు మొహిద్దీన్, శివ, విష్ణువర్ధన్, హర్షవర్ధన్, కృష్ణయ్య శోభన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'బండ' భారంపై పెల్లుబికిన నిరసన



కడప నగరంలో సిలిండర్లను చెత్తబండిలో వేసి నిరసన తెలియజేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాడే వంట గ్యాస్ ధరను అమాంతంగా పెంచేసింది. వంట సిలిండర్‌పై రూ.50 , వాణిజ్య సిలిండర్‌పై రూ. 350 పెంచుతూ సామాన్యులపై బండ భారం మోపింది. దీంతో జిల్లాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు తమ నిరసనను తెలియజేశారు. కడప నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో సిలిండర్లను చెత్త బండిలో వేసి ర్యాలీ చేపట్టి తమ నిరసనను తెలియజేశారు.

- సిలిండర్లను చెత్త బండిలో వేసి ఆందోళన
- వంట గ్యాస్ ధరల పెంపును వెంటనే రద్దు చేయాలి : సిపిఎం



జమ్మలమడుగు : నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

తక్షణమే రద్దు చేయాలి

కడప అర్బన్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజానీకం మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతోందని, తక్షణమే ఆ భారాలను రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఐ.ఎన్. సుబ్బమ్మ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న పూలే సర్కిల్‌లో గ్యాస్ ధరల పెంపు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగర కమిటీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వరుసగా గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. 2014, మార్చిలో రూ.410 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1155 కు చేరిందని పేర్కొన్నారు. గృహ వినియోగానికి వాడే వంటగ్యాస్ మీద రూ.50, వాణిజ్య అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ మీద రూ.350 భారం మోపడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు గ్యాస్ ధరలను పెంచి మరోవైపు విమాన ఇంధన ధరలను నాలుగు శాతం తగ్గించటం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గు ముఖం పట్టినా, మన దేశంలో ఎందుకు ధరలు పెంచుతున్నారో ప్రజానీకానికి బిజెపి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, పారుక్ హుస్సేన్, ఓబులేసు, ఎమ్మార్ నాయక్, షంషాద్, అన్వర్, షాకీర్, రాజమణి, కామేశ్వరమ్మ, రియాజ్, సాదిక్, ఆర్కే నగర్ శ్రీను, గోపాల కృష్ణయ్య, నారాయణ రెడ్డి, రమాదేవి, ప్రభాకర్, పండు, ఉదయ్, ఇమామ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీల కోసమా? ప్రజల కోసమా?

జమ్మలమడుగు రూరల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉండేది కార్పొరేట్ కంపెనీల ఆదాయం కోసమా ప్రజల సంక్షేమం కోసమా అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.మనోహర్ ప్రశ్నించారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో గ్యాస్ పెంపుదలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి రెండు కలిసి అనేక రూపాలలో ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా పనులను పెంచుతూ దుర్మార్గ చర్యలకు పాల్పడుతుందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక 16, 17 సార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి వర్గాల నడ్డివిరుస్తున్నారన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఆదుకోకపోగా కార్పొరేట్ కంపెనీలకు ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. పనిచేశాయన్నారు. రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ, నాయకులు వినయ్ కుమార్, డేవిడ్, ప్రసాద్ రెడ్డి, హాజీ, సుబ్రమణ్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు పెంచడం గర్హనీయం : తులసిరెడ్డి

వేంపల్లె : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ పై రూ 50, వాణిజ్య సిలిండర్ పై రూ 350 లు పెంచడం గర్హనీయమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014 ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధర బ్యారెల్ 114 డాలర్లు ఉన్నప్పుడు ప్రజలకు వంట గ్యాస్ సిలిండర్ ను రూ 410 లకు సరఫరా చేసిందని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 90 డాలర్లే ఉన్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను దాదాపు రూ 1200 చేయడం శోచనీయమని అన్నారు. గృహిణులు వంట గదిలోకి పోవాలంటే భయపడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ పాలనలో అచ్చే దిన్ కు బదులు చచ్చే దినాలు దాపురించాయని తెలిపారు. సబ్ కా వికాస్ బదులు సబ్ కా వినాస్ జరుగుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తుందని తులసిరెడ్డి అన్నారు.

ప్రజాసంక్షేమం గాలికి : టిడిపి

కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయని, పెరిగిన గ్యాస్ ధరలపై టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మండిపడ్డారు. టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో వంటింటి గ్యాస్ రూ, 415 రూపాయలు ఉన్న గ్యాస్ ధర నేటికీ మూడింతలు, వాణిజ్య వినియోగ గ్యాస్ ఏకంగా సిలిండర్ పై రూ, 300 పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ ప్రభుత్వాలు బాదుడే బాదుడుకు సిద్ధపడ్డాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై విరుచుకుపడ్డారు. ఏపీలో డీజిల్ ధరలకు, పొరుగు రాష్ట్రాల్లో డీజిల్ ధరలకు చాలా వ్యత్యాసం ఉండడంతో వాహనదారులు అక్కడి డీజల్‌ను వాహనాలకు వినియోగిస్తున్నారని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కాంట్రాక్టర్లను కుబేరులను చేస్తూ ఈ ప్రభుత్వం వినియోగదారులను దోపిడీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగం ఎక్కువ పేరుతో రేషన్ కార్డులు తొలగిస్తూ, రేషన్ కార్డు లేదని పింఛన్ తొలగించడం ఈ ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ప్రయోజనాలు పక్కన పెట్టి, పెంచిన గ్యాస్ త్వరలో పూర్తిస్థాయిలో తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్, నగర అధ్యక్షుడు శివకొండ రెడ్డి, ఆమూరి బాలరాజు, అమీర్, హరి పాల్గొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజానీకం మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతుందని, తక్షణమే ఆ భారాలను రద్దు చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జి సగిలి గురప్ప డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

స్టేట్ ఛాంపియన్లుగా నిలవాలి

జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కె.చిన్నపరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కగా రాణించి ఛాంపియన్లుగా నిలవాలని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కంభం చిన్నపరెడ్డి కోరారు. నగరంలోని డిఎస్ఎ క్రీడామైదానంలో వారంరోజులుగా నిర్వహిస్తున్న హ్యాండ్ బాల్ శిక్షణ శిబిరం ముగింపు నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా హ్యాండ్ బాల్ జూనియర్ విభాగం జట్లను గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడాదుస్తులు, రవాణా చార్జీలను అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం చక్కగా సాగిందన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలు, మెలుకువలు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించి విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కర్నూల్‌కు వెళ్లేందుకు క్రీడాకారులకు అయ్యే రవాణా ఖర్చులు పోతుల ట్రస్ట్ చైర్మన్ పోతుల వెంకట్రామిరెడ్డి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాదుస్తుల దాత, తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపీకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులకు తమవంతు సహకారం కొనసాగిస్తామని, మంచి ఆటతీరును కనబరచాలని ఆకాంక్షించారు. జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు క్రీడాస్ఫూర్తితో పాటు సమయస్ఫూర్తి కూడా అవసరమన్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ గౌరీశంకర్ మాటాడుతూ ప్రాక్టీస్ సమయంలో కాక బరిలో దిగినప్పుడు ఉత్తమ ప్రతిభ కనబరిచేవారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 5 వరకు కర్నూలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దాతలు సహకారం అందించి క్రీడాదుస్తులు, రవాణా ఛార్జీలు చెల్లించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను వారు ప్రకటించారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ శిక్షకుడు అబ్దుల్ మునాఫ్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్ రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.



జిల్లా జట్టుతో అసోసియేషన్ నాయకులు

జిల్లా జట్టు : ఎస్. చాంద్ బాషా, జి. ఉదయ్ కుమార్, ఎస్. అక్బర్, సి.మల్లికార్జున, బి.మురళీకృష్ణ, ఎస్. రజాక్, ఎస్. ఆదిశేషారెడ్డి, ఎన్. ఈశ్వర్, ఎస్. సుమిత్ కుమార్ రెడ్డి, బి.విక్రమ్ కల్యాణ్, ఎస్. నాగేంద్ర, ఎం. మోహన్ నాయక్, ఇ.వెంకటకృష్ణారెడ్డి, పి.ప్రసాద్, ఎం. గురువర్ధన్, బి. సాయికిరణ్ ఎంపికయ్యారు.

వైవీయూ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి కడప అర్బన్

బెంగళూర్‌లో నిర్వహించిన 36వ నేషనల్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్‌లో వైవీయూ లలితకలా విభాగానికి చెందిన విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జింకా రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి. వెంకట సుబ్బయ్య అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో నిర్వహించబోయే ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు అన్ని విధాలా సిద్ధం కావాలని పేర్కొన్నారు. అందులోనూ విజయం సాధించాలని ఆకాక్షించారు. లలిత కళా విభాగంవిద్యార్థుల నైపుణ్యతలు యూనివర్శిటీకే గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరింత పటిష్టంగా తయారు కావడానికి ప్రణాళిక లు తయారు చేయాలని ఆదేశించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు. యూనివర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య తప్పెట రామ ప్రసాద్ మాట్లాడుతూ బిఎఫ్ఎ విద్యార్థులు బి. గంప మల్లయ్య శిల్పకళా విభాగంలో 'శ్రమశక్తి' అనే అంశం పై శిల్పం చేసి ప్రథమ స్థానం, బి.పవన్ కళ్యాణ్ ఫోటోగ్రఫి లో ప్రథమ స్థానంలో నిలవడంతోపాటు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. మరో విద్యార్థి వై. అరవింద్ కార్టూన్ విభాగంలో తృతీయ స్థానం తో పాటు కాంస్య పతకం సాధించారని వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ తప్పెట రామ ప్రసాద్, టీమ్ మేనేజర్లు ప్రొఫెసర్ జి.విజయ భారతి, జి.కాత్యాయని, యూనివర్సిటీ పిఆర్ సెల్ సంచాలకులు ఎస్. వి. సుబ్బారెడ్డి , లలిత కళా విభాగం అధిపతి కె. మృత్యుంజయ రావు, అధ్యాపకులు వెంకటేష్, ఈరప్ప, చిన రాయుడు, అప్పలచారి. విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు సాధించిన విజయం పట్ల యూనివర్సిటీ అధ్యాపక, అనధ్యాపక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలి

ప్రజాశక్తి-కడప

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని, అన్ని రంగాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పిఆర్ అండ్ ఆర్ డి, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జెసి సాయికాంత్ వర్మ, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని ఆదేశించారు. జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని, జల్ జీవన్ మిషన్ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు ఎలాంటి కొరత లేకుండా మంచినీటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్వో గంగాధర గౌడ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా సంక్షేమ, సర్వే, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్

పిడిఎఫ్ అభ్యర్థులను బలపరుద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈనెల 13న జరిగే పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటేసి వారిని బలపరుద్దామని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.మనోహర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో గురువారం ఆయన ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ శాసనమండలిలో నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రస్తావించాలంటే ఖచ్చితంగా పిడిఎఫ్ అభ్యర్థులు ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వారి జీవితాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. బడా రాజకీయ నాయకుల మధ్య, పెట్టుబడిదారి పార్టీల మధ్య ప్రజల పక్షాన జనవాణి చట్టసభలలో వినపడాలంటే తప్పక పట్టభద్రుల తరపున పోతుల నాగరాజుకు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తరపున కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విజయ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్, నరేంద్ర, డివైఎఫ్ఐ డేవిడ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాఘవేంద్ర, సిఐటియు నాయకులు దాసు పాల్గొన్నారు. **వైవీయూలో ప్రచారం..**

కడప అర్బన్ : పశ్చిమ రాయల సీమ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, గ్రా డ్యుయేట్స్ పోతుల నాగరాజును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిచాలని ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్ల, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. దస్తగిరి, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మున్నయ్య తెలిపారు. గురు వారం వైవీయూలో ప్రచారం నిర్వహించారు. యూనివర్సిటీలో ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, నాన్ టీచింగ్ లను కలిసి అభ్యర్థించారు. వర్సిటీలోని పరిపాలన భవనం,సైన్స్ బ్లాక్, ఆర్ట్స్ బ్లాక్ వర్సిటీలో తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిడిఫ్ బలపరుస్తున్న అభ్యర్థులు నిత్యం ప్రజలకోసం పోరాడుతున్నారని చెప్పారు. కత్తి నరసింహారెడ్డి నిరుద్యోగుల సమస్యల, టీచర్స్ కోసం శాసన మండలిలో నిరంతరం విద్యా సమస్యలపైన గళం వినిపిస్తున్నారని అన్నారు. ఈ నెల 13న జరిగే పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఎన్నికలల్లో మొదటి ప్రాధాన్యత ఓటు ను వేసి గెలిపించాలని టీచర్స్, గ్రాడ్యుయేట్ ఓటర్స్ ఆభర్థులను కోరారు. కార్యక్రమంలో శివ, వెంకటేష్ పాల్గొన్నారు. **'కత్తి'కి అంజుమన్ మద్దతు..** పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి అంజుమన్ తరక్కి మద్దతు ఇస్తూ నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ హిదాయతుల్లా పేర్కొన్నారు. సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం కత్తి చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. ఉద్యమ నేత కత్తి నరసింహారెడ్డి ని గెలిపించుకుందామని ఉపాధ్యాయ లోకానికి పిలుపునిచ్చారు.

సైన్స్ ఫెయిర్ అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్



సైన్స్ ఫెయిర్ నమూనాలను పరిశీలిస్తున్న సలావుద్దీన్

విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సంఘ సేవకులు సలావుద్దీన్ పేర్కొ న్నారు. గురువారం నకాష్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచి టెక్నాలజీ, సైన్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు వారి నైపుణ్యాన్ని పెంపొ ందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భవిష్య త్తులో భారత దేశ ప్రగతిలో శాస్త్రవేత్తలుగా రాణించి ప్రపంచంలోనే భారతదేశ ప్రతిష్టలు పెంపొందించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తయారుచేసిన నమూనా పరికరాలు ఎంతగానో ఆకర్షించాయి. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

బంజారా హోలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

బంజారా హోలీ ఉత్సవాలను జయప్రదం చేయాలని మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో హోలీ ఉత్సవాల పోస్టర్ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శివానాయక్ మాట్లాడుతూ ఈ నెల 8న గిరిజన భవన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బంజారాల పవిత్ర పండుగ హోలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బంజారా కుటుంబాలు అందరు కలిసి బంజారాల సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టి సెల్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, సంఘం నాయకులు జగన్ నాయక్, సుధాకర్ నాయక్, ఉమేష్ నాయక్ పాల్గొన్నారు.

కనీస హక్కులు సాధించలేకపోయారు

ప్రజాశక్తి - కడప అర్బన్

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డి అక్రమాలు, తప్పుడు ప్రచారాలతో గెలవాలని ప్రయత్నిస్తున్నారని, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉండి కనీస హక్కుల సాధించలేకపోయారని ఇండిపెండెంట్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బండ్లపల్లి మదన్ మోహన్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు 30కి పైగా సంఘాల మద్దతు ఉన్నాయని ప్రచారం చేసుకుంటున్నారని, అన్ని సంఘాల మద్దతు ఉంటే ఆ సంఘాల పేర్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజకీయ అండదండలతో అధికారులను అడ్డం పెట్టుకుని గెలవాలని ఉపాధ్యాయులను బెదిరింపులకు గురిచెయ్యడం తగదన్నారు.



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ప్రణాళికతో చదివితే ఉన్నతంగా రాణించొచ్చు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి విద్యార్థి ప్రణాళికతో చదివితే ఉన్నతంగా రాణించొచ్చని జిల్లా సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఆదర్శ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యల గురించి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడాలన్నారు. అప్పుడే జీవితంలో విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరేంద్రశర్మకు సర్ సివి రామన్ అకాడమీ ఆహ్వానం

ప్రజాశక్తి - చాపాడు



అల్లాడుపల్లె దేవళాలులో వేద పండితుడిగా ఉన్న వెలుతుర్ల నరేంద్రశర్మకు సర్ సివి రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రుద్రాక్ష వైభవ ఆధ్యాత్మిక పీఠం వారు నిర్వహిస్తున్న ఉగాది మహోత్సవ సంబరాలకు ఆహ్వానం పంపారు. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాల నిష్ణాతులకు ఈనెల 5న సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవనంలో సన్మానించనున్నారు. కార్యక్రమంలో భాగంగా అల్లాడుపల్లె గ్రామ నివాసియైన వెలుతుర్ల నరేంద్రశర్మ సామవేదానికి వారు చేస్తున్న సేవకుగానూ సువర్ణ కంకణంతోపాటు సామవేద శిఖామణి బిరుదుతో ఘన సత్కారం నిర్వహించనున్నారు. జిల్లా నుండి నరేంద్ర శర్మ మాత్రమే ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న మహమ్మద్ షబ్బీర్

గుదిబండగా మారనున్న సీనరేజీ టెండర్లు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం చేపడుతున్న సీనరేజీ టెండర్లు ప్రజలకు గుదిబండగా మారనున్నాయని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్న తరహా ఖనిజాలపై సీనరేజ్ ఛార్జీలు వసూలు చేయడం శోచనీయమని అన్నారు. ఓ వైపు ప్రజల ఆర్థికాభివృద్ధికి బటన్ నొక్కుతున్నట్లు చెబుతూనే మరో వైపు పేద ప్రజలను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు చిన్న తరహా ఖనిజాలపై సీనరేజ్ ఛార్జీలు వసూలు చేయడమేంటని ప్రశ్నించారు. ఇల్లు కట్టుకోలేక పేద ప్రజలు విలవిలలాడుతుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా రాష్ట్ర ప్రభుత్వం సీనరేజ్ టెండర్లు వేయడం మంచిది కాదన్నారు. సీనరేజ్ టెండర్లు రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక, కంకర, మట్టి రాళ్లపై టెండర్లు రద్దు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, వార్డు మెంబర్ రామకృష్ణారెడ్డి, తిప్పారెడ్డి, పివి రమణ, గోటూరు నాగభూషణం, దొంతు సుమన్, ఇలియాస్, మాబు షరీఫ్ శ్రీనివాస్‌రెడ్డి, హబీబ్, శివయ్య, బాబు పాల్గొన్నారు.



శనగలను జల్లిపట్టే విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శనగ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ముద్దనూరు

శనగ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండలంలోని నల్లబల్లె రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌బికెల్లో శనగలు అమ్ముకునేందుకు ముందుగా రైతులు సిఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే మార్కెట్లో ధర తక్కువగా ఉందన్నారు. ఇప్పటి వరకు నల్లబల్లె ఆర్బికె పరిధిలో 26 మంది రైతులకు సంబంధించి 380 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. శనగలు కొనుగోలు, జల్లి పట్టే విధానం, తూకాలు పరిశీలించినట్లు చెప్పారు. డిజిటల్ కియోస్క్ మిషన్ పనితీరు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. నాణ్యత ప్రమాణాల మేరకు శనగలను కొనుగోలు చేయనున్నట్లు ఏజెన్సీ వారు తెలిపారు.

గ్యాస్ ధర పెంచడం అన్యాయం : కాంగ్రెస్

ప్రొద్దుటూరు : ఇప్పటికే నిత్యాసరసరుకుల ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఉంటే, మళ్లీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 పెంచడం తగదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రామాంజనేయులు, భాస్కర్, సైమన్ పాల్గొన్నారు.

సేవలు చేయడం గొప్ప వరం

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతులకు సేవలు చేయడం అనేది గొప్ప వరమని ఎంఇఒ వీరారెడ్డి, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజా పర్వీన్ పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో పని చేస్తున్న ఐఇఆర్‌టి రామాంజనేయురెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 25ఏళ్లుగా విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు సేవలందించడం గొప్ప విషయమన్నారు. ఇలా సేవలు చేయడం వారి అదృష్టంగా భావించాలన్నారు. రామాంజనేయురెడ్డి భవిష్యత్‌లో ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. చిన్నారి కావ్య పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో సంఘమిత్ర ప్రెసిడెంట్ సిరాజుద్దీన్, నరసింహులు, ఐఇఆర్‌టిలు యశోద, రాంబాబు, సంగీత లక్ష్మి, సిఆర్‌పిలు ప్రకాష్‌రెడ్డి, కల్యాణి, సూర్యకుమారి, దున్నపాటి, ఎంఐఎస్ అబ్దుల్ ఖాదర్, అకౌంటెంట్ మాధవి, సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రామాంజనేయురెడ్డిని సన్మానిస్తున్న ఐఇఆర్‌టిలు

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇంటి నిర్మాణాలు వేగవంతమయ్యేందుకు అధికారులు కృషి చేయాలని పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ సభ భవనంలో గురువారం ఆయన జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలపై గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి మాట్లాడుతూ ఇప్పటి వరకు పునాదులు తీయని లబ్ధిదారులను కూడా ఇంటి నిర్మాణాలు చేసేందుకు సచివాలయ సిబ్బంది చర్చించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు చేయకపోతే స్థల పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించాలన్నారు. గడువులోగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. అధికారులు జగనన్న కాలనీలకు వెళ్లి ఇంటి నిర్మాణాలపై పర్యవేక్షించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు లబ్ధిదారులతో ప్రతి రోజూ చర్చించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ వెంకటేష్, హౌసింగ్ ఇఇ బాల గంగన్న, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, విద్యుత్ ఎఇ చంద్ర శేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ఎఇ రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

ఆడపిల్లల సంఖ్య పెంచేందుకు కృషి



మాట్లాడుతున్న డాక్టర్ ముబీన్

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆడపిల్లల సంఖ్యను పెంచేందుకు అందరూ కృషి చేయాలని డాక్టర్ ఎస్.ముబీన్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రెండవ సచివాలయం పరిధి సుంకేసుల గ్రామంలో ఉన్న కెజిబివిలో గురువారం 'బేటి బచావో.. బేటి పడావో' కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆడపిల్లల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందన్నారు. పురుషులతో సమానంగా సంఖ్యను పెంచడానికి అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం మాట్లాడుతూ బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు అరికట్టడం కోసం పాటుపడాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటే 1098 నంబర్‌కు సమాచారమివ్వాలన్నారు. మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించారాని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, పిహెచ్‌యన్ అరుణకుమారి, సూపర్‌వైజర్ కృష్ణప్రియ, సిహెచ్ఒ కీర్తి, కెజిబివి ప్రిన్సిపల్ యం.కౌషర్, ఎఎన్ఎం శివనాగమణి, పక్కృతమ్మ, కెజిబివి ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, వెంకట సులోచన విద్యార్థినులు పాల్గొన్నారు.

లిప్ అమలుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో లిప్ అమలుకు ప్రతి ఉపాధ్యాయుడు చిత్తశుద్ధితో కృషి చేయాలని మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు కోరారు. స్థానిక మదీనాపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అలాగే ఉపాధ్యాయులతో లిప్ కార్యక్రమంపై చర్చించారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి పాఠ్యప్రణాళిక చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల అభ్యసనంపై ప్రత్యేకదృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. టీచింగ్ పిరియడ్‌తోపాటు ప్రాక్టీస్ అమలుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న చెరుకూరి శ్రీనివాసులు

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

సృష్టిలోని ప్రతి జీవికి కంటి చూపు ప్రధానమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మానవతా సంస్థ ముద్దనూరు ఆధ్వర్యంలో బెంగళూరు శంకర్ నేత్రాలయ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం శ్రీ వైష్ణవి పెట్రోల్ బంకు వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రత్యేక వైద్య నిపుణులు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారిని బెంగళూరుకు తరలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మానవత సంస్థ అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, సభ్యులు మనోహరరెడ్డి, జగదీష్, శేషయ్య నాయుడు, నాగేంద్రరెడ్డి, బాల మునిస్వామిరెడ్డి, రవిచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి - చాపాడు

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు సూచించారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మీపేట, చియ్యపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయన 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ విద్యార్థికి 10వ తరగతి ఎంతో ముఖ్యమైన దశ అన్నారు. ఉన్నత విద్యలో రాణించాలంటే 10వ తరగతి కీలకమైందన్నారు. తక్కువ మార్కులు వస్తున్న సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు. ప్రణాళిక వేసుకుని చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. లక్ష్మీపేట హైస్కూల్లో విద్యార్థులతో కలిసి డిఇఒ మధ్యాహ్నం భోజనంలో పాల్గొన్నారు. చియ్యపాడు పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఇఒ రవిశంకర్, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, నరహరి శర్మ,ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



చియ్యపాడులో విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ దేవరాజు

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

పులివెందుల టౌన్ :రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు హోటళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్, ఇతర వ్యాపారులు రాత్రివేళ రోడ్లపై ఇష్టానుసారం చెత్త వేస్తున్నారని, అలా వేస్తే అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వాడినా అపరాధ రుసుం విధిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం మొల్లమాంబకు అంకితం

ప్రొద్దుటూరు: ఈ నెల 8న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే మహిళా దినోత్సవాన్ని మహాకవయిత్రి మొల్లమాంబకు అంకితం చేస్తున్నట్లు మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. గురువాయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రొద్దు టూరుకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయిని, కవయిత్రి కోటా దుర్గా భవానికి మొల్ల సాహితీ సేవా పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

సర్వీస్ కమిషన్ ద్వారా ఖాళీలు భర్తీ చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా యుపిఎస్‌సి తరహాలో ఖాళీలను భర్తీ చేయాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విద్యాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ఇంజనీరింగ్ కళాశాలల్లోని అధ్యాపకుల ఖాళీలతోపాటు ప్రభుత్వ ఇంజనీర్ పోస్టులు కూడా ఎన్నో ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఎపిపిఎస్‌సి క్రమం తప్పకుండా ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి

రాయచోటి: జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వ భూములనుమ గుర్తించాలని కలెక్టర్ గిరిష తహశీల్దార్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూ సేకరణపై రాయచోటి నియోజకవర్గంలోని తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుత రాయచోటి నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డికెటి, ప్రభుత్వ భూములు గుర్తించి రెండు రోజుల లోపల తమకు రిపోర్టు పంపాలన్నారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా గుట్టలు మినహా అందుబాటులో ఉన్న అనువైన భూములు గుర్తించాలని తెలిపారు. కార్యక్రమాన్ని తహసిల్దార్లు, సర్వేయర్లు సీరియస్‌గా తీసుకొని త్వరితగతిన భూ సేకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, తపశీల్దార్లు పాల్గొన్నారు.

రేపు హజ్రత్ సయ్యద్ యూసుఫ్ షాఖాదిరి ఉరుసు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని బండ్లపెంటలో వెలసిన యూసుఫ్ షాఖాదిరి (దివానే సాహెబ్) శుక్రవారం గంధం. శనివారం ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసు ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా హిందూ ముస్లిం సోదరులు తమ మొక్కులను తీర్చుకుంటారని పేర్కొన్నారు. షహజాద్ బాబా హుస్సేన్ సాహెబ్, మొయినుద్దీన్ హుసేని అధ్వర్యంలో గంధం నిర్వహిస్తారన్నారు. అదే రోజు భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉరుసు రోజు రాత్రి 9 గంటలకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టీవీ సింగర్ జునైద్ సుల్తాని, ముంబాయికి చెందిన టీవీ సింగర్ చోటి షబ్ నమ్, ఢిల్లీకి చెందిన టీవీ సింగర్ రయీస్ అనీస్ సంగీత గాయకులచే గంధం, ఉరుసు రెండు రోజులు గొప్ప ఖవ్వాలి పాటల పోటీ ఉంటుందని తెలిపారు. ఉరుసు ఉత్సవాలకు హిందూ ముస్లిం సోదరులందరూ తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని, ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



పశువులకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

పశువులకు టీకాలు తప్పక వేయించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశువులకు టీకాలు తప్పక వేయించాలని జమ్మలమడుగు పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసులు రైతులకు సూచించారు. మండలంలోని పి.బొమ్మేపల్లె గ్రామంలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం మార్చి చివరి వరకు జరుగుతుందన్నారు. పి.బొమ్మేపల్లి గ్రామంలో ప్రతి గేదె, ఆవుకు టీకాలను వేశామన్నారు. నాలుగు నెలలు పైబడిన ప్రతి దూడకూ టీకా వేశామన్నారు. వ్యాధి లక్షణాలు, ప్రాముఖ్యత, నివారణ చర్యలను పశు పోషకులకు ఆయన వివరించారు. పాడి రైతుల ఇంటి వద్దకే వచ్చి టీకాలను అందిస్తామని ఆయన అన్నారు. టీకాలపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యులు డాక్టర్ జి.జాన్ సుధాకర్‌బాబు, మోహన్ నాయక్, అటెండర్ పరుశురాం పాల్గొన్నారు.



రెడ్యంను పరామర్శిస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి

'రెడ్యం'కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని కడప నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో గురువారం పలువురు పరామర్శించారు. ఆయనకు బుధవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారధిరెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కొనిరెడ్డి విజయమ్మ కుమారుడు కొనిరెడ్డి రితీష్‌రెడ్డి, టిడిపి కడప నియోజకవర్గ బాధ్యులు విఎస్ అమీర్‌బాబు, సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, సత్య సాయినాథ్‌శర్మ, వికాస్ హరికృష్ణ, పుత్తా చైతన్యరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హ ప్రసాద్, మాసాపేట శివ, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, జియావుద్దీన్, మైదుకూరు నియోజకవర్గంలోని నాయకులు రెడ్యంను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు శ్రీనివాస ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



శ్రీనివాస ఆలయం

స్థానిక సుందరయ్య నగర్ పద్మావతి పురంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం పట్టణ ప్రధాన రహదారుల గుండా స్వామి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వారు వివరించారు.



బహుమతులు అందిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'నైతిక-మానవత విలువలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మొదటి నాలుగు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొండారెడ్డి, అధ్యక్షులు రాఘవరెడ్డి, ట్రెజరీ హరిశ్చంద్రరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు నాగేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను శనివారం ఉదయం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని ఆయన కోరారు.